పెండింగ్ పనులు

పూర్తిచేయండి

కమిషనర్‌ను కోరిన కార్పొరేటర్

జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

బంజారాహిల్స్,డిసెంబర్ 16: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కోరారు. సోమవారం కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ మాట్లాడుతూ. డివిజన్ పరిధిలోని ఇందిరానగర్, పద్మాల్యయ అంబేద్కర్‌నగర్, ఫిలింనగర్ రోడ్డు నంబర్ 9లోని సాయిబాబా ఆలయం రోడ్డు తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్డు పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిని వెంటనే ప్రారంభించాలని కోరారు. దీంతో పాటు వివిధ బస్తీల్లో కమ్యూనిటీహాళ్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.

డ్రైనేజీ సమస్యకు పరిష్కారం

సికింద్రాబాద్, డిసెంబర్ 16: నియోజకవర్గంలోని వారాసిగూడ విశాల్ మార్ట్ ఎదురుగా ఉన్న రోడ్డులో నిరంతరంగా డ్రైనేజీ ఓవర్ ఫ్లో అవుతుందని కార్పొరేటర్ హేమకు స్థానికులు ఫిర్యాదు చేశారు. కాగా సోమవారం అధికారులతో కలిసి ఆప్రాంతంలో కార్పొరేటర్ హేమ పర్యటించారు. డ్రైనేజీ ఓవర్‌ఫ్లో గల కారణాన్ని తెలుసుకొని త్వరగా సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శాశ్వతంగా పరిష్కారమయ్యేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానికులతో ఆమె మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే తెలుపాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ కుషాల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నిరసన వ్యక్తం చేసిన పారిశుద్ధ్య కార్మికులు

జూబ్లీహిల్స్,డిసెంబర్ 16 : జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం యూసుఫ్‌గూడలోని జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు రూ.26 వేలకు పెంచాలని, కాంట్రాక్ట్.. ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మున్సిపల్ కార్మికులందరినీ వెంటనే పర్మినెంట్ చేయాలనారు. ఈ సందర్భంగా 13 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ బాలరాజుకు, శానిటేషన్ విభాగాధిపతి విజయ్‌కుమార్‌కు అందజేశారు. సీఐటీయూ ప్రజా సంఘాల నాయకులు టి.సాయిశేషగిరిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ జోన్ నాయకులు రాపర్తి అశోక్, జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మిక సంఘం నాయకులు మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

యూసుఫ్‌గూడ జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, సీఐటీయూ నాయకులు

యాజమాన్యం ఆదుకోవాలి

కాటేదాన్‌లోని మోడ్ వర్క్స్ ప్లైవుడ్ పరిశ్రమ యజమానికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 16: పారిశ్రామిక వాడల్లో పని చేస్తున్న వలస కార్మికులకు ప్రమాదాలు జరిగితే యాజమాన్యాలు పట్టించుకోకుండా నిర్లక్ష్య వైఖరి వహిస్తున్నాయని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు, కాటేదాన్ క్లస్టర్ కన్వీనర్ జాజాల రుద్రకుమార్ అన్నారు. పని చేస్తున్న సమయంలో కార్మికుడికి గాయమైన అతడిని యాజమాన్యం పట్టించుకోకపోవడంతో సోమవారం యజమానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రుద్రకుమార్ మాట్లాడుతూ కాటేదాన్ పారిశ్రామిక వాడలో మోడ్ వర్క్స్ ప్లైవుడ్ పరిశ్రమలో కర్ణాటక ప్రాంతానికి చెందిన వలస కార్మికుడు భైరవనాథ్ పని చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కాలు ఫ్యాక్చర్ అయింది. అప్పటి నుంచి యాజమాన్యం కార్మికుడిని ఆదుకోకుండా కాలయాపన చేస్తుందన్నారు. పరిశ్రమ యజమానిని కలిసి కార్మికుడికి న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకుడు బజ్జలకూర స్వామి, సాయికిరణ్ తదితరులున్నారు.

ప్రజలకిచ్చిన హామీలను విస్మరించిన కేంద్రం

హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఈ.టీ.నరసింహ,పాల్గొన్న పార్టీ నాయకులు

హిమాయత్‌నగర్, డిసెంబర్ 16: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పేదలకు అనేక హామీలు ఇచ్చి అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈ.టీ.నరసింహ, నగర కార్యదర్శి ఎస్.ఛాయాదేవి విమర్శించారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో సీపీఐ నగర కార్యవర్గ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పని చేస్తూ ప్రజల సమస్యలను కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. సీపీఐ పార్టీ ఏర్పడి వందేండ్లు కావస్తున్న సందర్భంగా నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఈ నెల 26న జెండాలను ఆవిష్కరణ చేయాలన్నారు.పార్టీ చేసిన పోరాటాలు, త్యాగాలు, సాధించిన విజయాలను ప్రజలకు తెలిపేందుకు సదస్సులు,ర్యాలీలు, సమావేశాలు నిర్వహించి పార్టీ బలోపేతం కోసం ప్రతి పార్టీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో పార్టీ నగర సహాయ కార్యదర్శులు స్టాలిన్, కమతం యాదగిరి,నేతలు బి.వెంకటేశం, ఎన్. శ్రీకాంత్, పడాల నళిని,కాంపల్లి శ్రీనివాస్, వెంకటస్వామి, సలీంఖాన్,మహమ్మద్ సలీం, ఉమర్‌ఖాన్ పాల్గొన్నారు.

రోడ్లపై వ్యర్థాలు డంప్ చేసే కఠిన చర్యలు

10 వేల రూపాయల జరిమానా విధించిన జీహెచ్ఎంసీ అధికారులు

గగన్‌పహాడ్‌లో రోడ్డుపై వేసిన నిర్మాణ వ్యర్థాలను తొలగింప చేస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 16: రోడ్లపై వ్యర్థాలను డంప్ చేసే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధిస్తామని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ హెచ్చరించారు. గగన్‌పహాడ్‌లో అశ్వన్‌కుమార్ అగర్వాల్ అనే వ్యక్తి రోడ్డుపై, పుట్‌పాత్‌పై ఇంటి నిర్మాణ వ్యర్థాలను డంప్ చేశాడు. దీనిని గుర్తించి జీహెచ్ఎంసీ అధికారులు సోమవారం రూ. 10 వేల జరిమానా విధించారు. అలాగే రోడ్డుపై వేసిన నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ రవికుమార్ మాట్లాడుతూ కొందరూ కావాలని రాత్రి సమయాల్లో మట్టిని, నిర్మాణ వ్యర్థాలను తీసుకొచ్చి ఖాళీ స్థలాలు, రోడ్లపై డంప్ చేస్తున్నారన్నారు. అలాంటి వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నారన్నారు. ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి రాత్రి సమయంలో సైతం విధులు నిర్వహింపజేస్తున్నట్లు వివరించారు. ప్రజలంతా పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్లు లేక.. ప్రయాణికుల ఇబ్బందులు

రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేత

రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నారగూడెం మల్లారెడ్డి తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 16: బస్సుల కోసం వేచి చూసే ప్రయాణికులకు సరైన బస్‌షెల్టర్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు. ప్రయాణికుల ఇక్కట్లపై సోమవారం రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

- ఈ సందర్భంగా నారగూడెం మల్లారెడ్డి మాట్లాడుతూ రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ రైల్వేస్టేషన్ కాలనీ కూడలిలో ప్రయాణికులకు బస్‌షెల్టర్లు లేక ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్సుల కోసం రోడ్డుపైనే వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు.
- ఈ సమయంలో అనేక మంది ప్రయాణికులకు రోడ్డు ప్రమాదాలకు గురైన ఘటనలు సైతం అనేకం ఉన్నాయన్నారు.
- హైదరాబాద్ వైపు వచ్చే బస్సులు, అటూ శంషాబాద్ వెళ్లే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు.
- బస్‌షెల్టర్లు లేకపోవడంతో ఆర్టీసీ బస్సు డ్రైవర్లు బస్సులను ఆపడం లేదన్నారు.
- దీంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించే పరిస్థితి ఏర్పడుతుందన్నారు.
- కాటేదాన్, శ్రీరామ్‌నగర్ కాలనీ, నేతాజీ నగర్ కాలనీ తదితర ప్రాంతాల ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల సమస్యలను పరిష్కరించి వెంటనే బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో నల్లుట్ల జగన్, వినయ్‌రెడ్డి, మాగాని శివ తదితరులు పాల్గొన్నారు.

బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 16: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 4వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www. osmania .ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ప్రజావాణిలో ఫిర్యాదులు

జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ రవికుమార్‌కు సర్కిల్‌లోని టౌన్ ప్లానింగ్ సమస్యలపై రెండు ఫిర్యాదులను అందజేశారు. ఈ సందర్భంగా డీసీ రవికుమార్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు పాటుపడుతున్నామన్నారు.

– బండ్లగూడ, డిసెంబర్ 16

'బీట్ అండ్ పీసెస్'

పుస్తకావిష్కరణ

స్పోర్ట్స్ అనాలిస్ట్, కామెంటర్ సి.వెంకటేశ్ రచించిన 'బీట్ అండ్ పీసెస్'.... ది లైటర్ సైడ్ ఆఫ్ క్రికెట్ పుస్తకాన్ని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం సాయంత్రం ముఖ్య అతిథిగా హాజరైన సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు వి. చాముండేశ్వరినాథ్, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ, కమర్షియల్ ట్యాక్సెస్ మాజీ జాయింట్ కమిషనర్ పీవీ సుబ్బారావు, మాజీ అడిషనల్ కమిషనర్ వి. హర్షవర్ధన్, సీనియర్ స్పోర్ట్స్ జర్నలిస్టు వీవీ సుబ్రహ్మణ్యం, కామెంటర్ సుధీర్ మహావాడితో కలిసి ఆవిష్కరించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ క్రికెట్ అభిమానులు ప్రపంచ వ్యాప్తంగా ఎంత మంది ఉంటారో, ఒక్క భారతదేశంలోనే అంత మంది ఉంటారన్నారు. అనంతరం అంధ క్రికెటర్లు గంట్యాల శ్రీధర్, జి. మధు, కె. అనిల్ రెడ్డిలను సత్కరించారు.

– ఖైరతాబాద్, డిసెంబర్ 16

నేటి నుంచి పశువైద్య

జాతీయ సదస్సు

వ్యవసాయ యూనివర్సిటీ ,డిసెంబర్ 16: మంగళవారం (నేటి) నుంచి మూడు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సులో పశువైద్యంపై సుదీర్ఘ చర్చ జరుగనుంది. పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నిర్వహించే ఈ సదసు ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరుగనుంది.33వ నేషనల్ కాంగ్రెస్ నేషనల్ సింపోజియం ఆఫ్ పారాసిటాలజీ అనే అంశంపై సుదీర్ఘ చర్చ జరుగనుంది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి శాస్త్రవేత్తలు పెద్ద ఎత్తున పాల్గొననున్నారు. జంతు,పరాన్నజీవుల నియంత్రణ,వ్యూహాలలో చేసిన మార్పులు, నూతన ఆవిష్కరణలు పెద్ద ఎత్తున జరుగనున్నాయని రిజిస్ట్రార్ డా. శరత్ చంద్ర తెలిపారు. జంతు,మానవ ఆరోగ్యం,పరాన్నజీవుల నియంత్రణ ,కొత్త మార్పులు తదితర అంశాలపై చర్చ జరుగనుందన్నారు. నిపుణులకు శాస్త్రీయ గోష్టి ఒకవేదిక కానుందన్నారు. ప్రధానంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనతి కాలంలోనే వ్యవసాయంతో పాటు , గొర్రెల మేకల పెంపకం , పశుపోషణ, ఫిషరీస్‌ను ప్రోత్సహించడం వల్ల ఈ పదేళ్ల కాలంలో దేశంలోనే తెలంగాణకు ఒక ప్రాధాన్యత కల్పించుకున్నది. కార్యక్రమంలో వెటర్నరీ నిపుణులు,డాక్టర్ల సహకారాన్ని ప్రోత్సహించేందుకు ఈ సదస్సు ఉపయోగ పడుతుందన్నారు.

కమ్మని నీరా తాగుతూ.. హుస్సేన్‌సాగర్ తీరాన కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గౌడన్నల కోసం ఉపాధి కల్పించడానికి నీరా సెంటర్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. సాగర్ అందాలను ఆస్వాదిస్తూ సోమవారం పర్యాటకులు కుటుంబ సభ్యులతో కలిసి నీరాను సేవిస్తున్నారు. – ఖైరతాబాద్

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం

సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్, డిసెంబర్ 16: వరద ముంపు సమస్య నుంచి గాయత్రీనగర్ ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపించనున్నట్టు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సోమవారం అమీర్‌పేట్ డివిజన్‌లోని గాయత్రీనగర్‌లో అధికారులతో కలిసి పర్యటించారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో కాలనీలోని నాలా ఉప్పొంగి ముంపునకు గురవుతుంది. అప్పట్లో మంత్రిగా ఉన్న సమయంలో ఆ ప్రాంతంలో పర్యటించి శాశ్వత పరిష్కారం కోసం రూ.1.50 కోట్లు మంజూరు చేయించినట్టు తెలిపారు. ఈ నిధులతో 95 మీటర్ల మేర బాక్స్ డ్రైన్ నిర్మాణం చేపట్టాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి పనులు ప్రారంభించారు. అందులో 45 మీటర్ల వరకు పనులు పూర్తి అయ్యాయి. మిగిలిన పెండింగ్ పనులు త్వరిత గతిన పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ గాయత్రీనగర్‌లో పర్యటించి పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను వెంటనే ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పూర్తి అయితే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అంతే కాకుండా నాలాను పూర్తిస్థాయిలో శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ వెంకట నారాయణ, డీఈ వాసుదేవ రెడ్డి, ఎస్ఎన్‌డీ డీఈ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఇంధన ఆదాపై అవగాహన అవసరం

జాతీయ శక్తి పొదుపు వారోత్సవాల్లో ప్రొఫెసర్లు

వాణి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సీబీఐటీ ప్రొఫెసర్లు

బండ్లగూడ, డిసెంబర్ 16 : జాతీయ శక్తి పొదుపు వారోత్సవాలలో భాగంగా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మాధవి నగర్‌లోని వాణి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనగా కాలనీలో ఎనర్జీ వాక్ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పోటీలలో విజేతలుగా నిలిచినవారికి బహుమతులు, నోట్ పుస్తకాలను అందజేశారు. సీబీఐటీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ సురేష్ బాబు, మాధవి నగర్ అసోసియేషన్ అధ్యక్షుడు విరాము యాదవ్‌లు ఇంధన ఆదాపై పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులలో సరైన అవగాహన పెంపొందించాలన్నారు. ప్రతి పౌరుడు తన కొనుగోలు శక్తి మేరకు కాకుండా సామాజిక బాధ్యతగా అవసరానికి తగ్గట్టు ఇంధన వనరులు ఉపయోగించాలని దీని ద్వారా వ్యక్తులపై ప్రత్యక్షంగా భారం తగ్గుతుందని, పరోక్షంగా దేశాభివృద్ధి, పర్యావరణానికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీబీఐటీ కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ సతీష్, రాకేష్, పాఠశాల ఉపాధ్యాయులు సౌజన్య, మాధవి నగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు మహేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నానల్‌నగర్‌లో ఆధార్ కేంద్రం ప్రారంభం

మెహిదీపట్నం, డిసెంబర్ 16: ప్రజలకు ఆధార్ కార్డులో సవరణలు, పేర్ల నమోదు కోసం నానల్‌నగర్ వార్డు కార్యాలయంలో సోమవారం ఆధార్ సేవల కేంద్రాన్ని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నానల్‌నగర్ కార్పొరేటర్ నసీరుద్దీన్ ప్రారంభించారు.

అనాథ పిల్లలకు ఆర్థిక సాయం అందజేత



అనాథ పిల్లల సంరక్షణకు ఆర్థిక సహాయం అందజేస్తున్న కౌన్సిలర్ ప్రతినిధి పారేపల్లి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 16 : అనాథ పిల్లలకు తొండుపల్లి 11వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి పారేపల్లి శ్రీనివాస్‌గౌడ్ ఆర్థిక సహాయం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథ పిల్లల సంరక్షుడు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగంటి నర్సింహకు శంషాబాద్ మున్సిపాలిటీ 11వ వార్డు తొండుపల్లి కౌన్సిలర్ ప్రతినిధి పారేపల్లి శ్రీనివాస్‌గౌడ్ 32వేల ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. తనకు ఉన్నదాంట్లో సహాయం చేసి గొప్పమనసు చాటుకున్న శ్రీనివాస్‌గౌడ్‌కు అనాథ పిల్లల సంరక్షకుడు నర్సింహ కృతజ్ఞతలు తెలిపారు.

అసభ్యకరంగా ప్రవర్తన

వెంగల్‌రావునగర్, డిసెంబర్ 16 : మహిళ ముందు దుస్తులు విప్పి అసభ్యంగా వ్యవహరించిన ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.... వెంగల్‌రావునగర్ కాలనీలో నివాసం ఉండే మహిళ (42) ఇంటి ముందు పెద్దపులి శ్రీకాంత్, శ్రీనివాస్‌లు హాస్టల్‌ను నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి ఇంటి ముందు నిలబడి ఉన్న బాధిత మహిళను చూస్తూ శ్రీకాంత్ దుస్తులు విప్పి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాధిత మహిళ భర్తతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

లక్ష్మీనర్సింహ స్వామినగర్‌లో ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

మణికొండ, డిసెంబర్ 16: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సంఘ సేవకుడు కిరణ్‌కుమార్ వెల్లడించారు. పుప్పాలగూడ లక్ష్మి నర్సింహ స్వామి నగర్ కాలనీలో సోమవారం డిలైట్ ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా కాలనీ వాసులకు రక్తపోటు పరీక్షలు, బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర పరీక్షలను నిర్వహించారు. అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ డిలైట్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

పేద ప్రజలు నివసించే ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అజయ్‌కుమార్‌రెడ్డి, ప్రహ్లాద్ , ప్రణీత్, శ్రీనివాస్, రవి, రామకృష్ణ, సదాపటేల్, జయశంకర్, వేణు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులు త్వరితగతిన చేపట్టాలి

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, డిసెంబర్ 16: దాయర మార్కెట్‌లో మంచినీటి పైపులైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ జలమండలి అధికారులను ఆదేశించారు. వాహనాల రాకపోకలు, స్థానికుల ఇబ్బందుల దృష్ట్యా పనులు వేగంగా చేపట్టాలని సూచించారు.

సోమవారం ఆయన జలమండలి డీజీఎం మోహన్‌రాజ్, జీహెచ్ఎంసీ డీఈ గీతతో కలిసి రాంనగర్ దాయర మార్కెట్‌లో కొనసాగుతున్న పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు సాగుతున్న తీరు, జాప్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పైపులైన్ నిర్మాణానికి అడ్డుగా ఉన్న రాక్‌ను తొలగించాలని, అన్ని జాగ్రత్తలు తీసుకున్న తరువాత తొలగింపు చేపట్టాల్సిందిగా సూచించారు. అనంతరం భరణి అయిల్ మిల్ వీధిలో పర్యటించిన ఎమ్మెల్యేకు రోడ్డు నిర్మాణం చేపట్టాల్సిందిగా స్థానికులు కోరారు. నాలుగు నెలలుగా రోడ్డు తవ్వి వదిలి వేయడంతో ఇబ్బందులు పడుతున్నామని ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే వెంటనే రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు ప్రారంభించాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

దశలవారీగా పెండింగ్ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ విభాగం నాయకుడు ముఠా జయసింహ, రాంనగర్ అధ్యక్షుడు శంకర్‌ముదిరాజ్, కొండ శ్రీధర్‌రెడ్డి, ముచ్చకుర్తి ప్రభాకర్, దీన్ దాయాల్‌రెడ్డి, కేశపురం అరుణ్, ముదిగొండ మురళి, శివముదిరాజ్, గండు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పద్మకు నటరాజ జీవిత సాఫల్య పురస్కారం

పద్మను సత్కరిస్తున్న జస్టిస్ మాధవి

ముషీరాబాద్, డిసెంబర్ 16: వంశీ ఆర్ట్ థియేటర్స్–వంశీ కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో నిర్వహించిన పద్మమోహన్ ఆంధ్ర నాట్య ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. నవ జనార్దన పారిజాతంలోని భామ కలాపం రక్తి కట్టించారు. కార్యక్రమంలో జస్టిస్ మాధవి ముఖ్యఅతిథిగా పాల్గొని పద్మ మోహన్‌కు నటరాజ రామకృష్ణ పేరిట జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. వంశీ సంస్థల వ్యవస్థాపకుడు వంశీ రామరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆంధ్ర నాట్య కళాకారుడు డాక్టర్ కళాకృష్ణ, పద్మమోహన్, ఉమామహేశ్వరి, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.